

# ప్రతీకారం

రామిగాని మదన మోహన్ రెడ్డి

'మదనపల్లి నుండి హైదరాబాద్ వెళ్లు ఎ ఎ జడ్ 3939 నెంబరు గల సూపర్ డీలక్స్ బస్సు బయల్దేరుటకు సిద్ధముగా ఉన్నది' - ప్రకటన విని పరుగులాంటి నడకతో వెళ్లి బస్సెక్కాను.

ముందుగా రిజర్వ్ చేయించాను కాబట్టి సీటుకు ఢోకాలేదు. డీలక్స్ బస్సు. సుఖమైన ప్రయాణం హైదరాబాద్ వరకు అనుకుంటూ కిటికీ ప్రక్క సీటు నెంబరు ఇరవై ఎక్కడుందా అని చూడగా నా సీట్లో ఏదో భారీ ఆకారం కూర్చొని ఉంది. అది చూసి నాకు తెలియకుండానే ముఖం చిట్లించుకొన్నాను. నేను పొందబోయే సుఖ ప్రయాణాన్ని అప్పటికే వేరొకరు అనుభవిస్తున్నట్లయిపోయి, విసుగ్గా నా సీట్లో కూర్చొన్న ఆ స్థూల కాయుడి దగ్గరకు వెళ్లి "నా సీటు నెంబరు ఇరవై" అన్నాను ఇంకేమీ పొడిగించకుండా..

అతను నా వైపు చూసి, ముప్పై ఆరు పళ్లు కనబడగల ఓ నవ్వు నవ్వి 'నాసీటు నెంబరు పందొమ్మిది లెండి' అని ఇవతలి వైపునున్న సీటులోకి తన శరీరాన్ని దొర్లించుకొని కూర్చొన్నాడు. 'హమ్మయ్య' అనుకొని చేతిలోని బ్రీఫ్‌కేసుని పై అరలో ఉంచి సీటు నెంబరు ఇరవైలో శరీరాన్ని దించాను. బస్సు బయల్దేరింది.

నా శరీరానికి ఇరవైయవ సీటు ఇరుకై పోయింది. కారణం పక్కనున్న అతను సగానికి పైగా నా సీటును ఆక్రమించేశాడు. 45 కిలోల బరువు, ఐదు అడుగుల ఎత్తు చూడ్డానికి వాడిపోయిన మునక్కాయలా ఉన్న నాకు ఇరవైయవ సీటు విశాలంగా సరిపోతుంది. కాని భారీ కాయుడి భారాన్ని నా సీటే కాక నేను కూడా భరించాల్సి వచ్చినందుకు విసుగ్గానూ, ఒకొంత కోపంగానూ ఉంది అతనిపైన. ఇంతలో బస్సు కండక్టర్ నా టిక్కెట్ చెక్ చేసి వెళ్లాడు.

బస్సు కుదుపుల్లేకుండా, ఎక్కువ శబ్దం లేకుండా వెళుతోంది. అందరు వారి వారి సీట్లలో సుఖంగా కాళ్లు చాపుకొని, వెనక్కు వాలి సుఖంగా పయనిస్తుంటే నాలో కుళ్లు కూడా బయల్దేరింది. ఇంతలో బస్సు ఓ మలుపు తిరగసాగింది. అంతే! స్థూలకాయుడు బ్యాలెన్స్ లేనట్టుగా పూర్తిగా ఒరిగి

పోయాడు. నేను మూలకు ఒత్తుకుపోయి గింజుకోసాగాను. బస్సు మలువు దాటింది. అతను సర్దుకొని కూర్చొన్నాడు. నేను ఊపిరి పీల్చుకొన్నాను. ఇంకా పన్నెండు గంటలు ఇతనితో ఈ అవస్థ తప్పదనుకొంటుండగా

నా కేదో హఠాత్తుగా గుర్తుకు వచ్చింది.

ఆ వెంటనే ఆనందం కూడ కలిగింది. సీటుకు ఇరువైపులా చేతులు అమర్చి ఉంటారు మన చేతులు పెట్టుకోవడానికి రెండు సీట్ల మధ్యలో అమర్చి ఉన్న హ్యాండ్ రెస్ట్! 'అది ఉంటే అతని సీట్లో అతను నా సీట్లో నేను సుఖంగా ఉండవచ్చు' అనుకొని దాని కోసం వెతికాను. కాని అది లేదు. విరిగిపోయింది. నాకు ఒక్కసారిగా ఆర్ టి సి మీద కోపం బుస్సుమంది. కాని బుస కొడితే బుస రోగం [ఆస్త్మా] అనుకొంటారని బుస కొట్టలేదు.

ఇంతలో మళ్లీ మలువు - నాపై మళ్లీ అతని తనువు. విలవిల్లాడి పోయాను. అతనిపై మళ్లింది నా కోపం. అతనిపై ఏవిధంగా నా కోపం ప్రదర్శించాలో తెలీదు. నేను కోపంలో ఉన్నప్పుడు నా ముఖం ఎవరైనా చూశారంటే నవ్వకుండా ఉండలేరు. అంతెందుకు నా ముఖం నేను అద్దంలో చూసుకొంటే నాకే నవ్వాగదు. ఫీల్డుకు పోతే బాబూమోహన్ని బ్రహ్మానందాన్ని పడగొట్టేయగలను.

ఇంతలో మళ్లీ మలువు తిరిగింది బస్సు, భారం నాపై పడింది. భరించలేనంత వినుగు బయల్దేరింది నాలో. సర్దుకొనే ప్రయత్నం చేశాను. సర్దుకోలేక పోయాను. ఇంతలో అతగాడు తన ఎయిర్ బ్యాగ్‌లోంచి ఏదో పొట్లంతీసి, విప్పి మిక్చర్ లాంటిది తినసాగాడు. నాకెందుకో పళ్లు మండిపోసాగింది. అతను రెండు దవడలతో 'కరుంగ్...కరుంగ్'మని నమలడం, పిడికెడు మిక్చర్ చేతిలోకి తీసుకొని గవ్వున నోటిలోకి కొట్టుకోవడం...అతని ప్రవర్తనకు నా ఒళ్లు కంపరమెత్తింది.

నే నాస్థితిలో ఉండగా నా కోపాన్ని రెట్టింపు చేయగల ఓ మలువు. అతను తింటున్నాడు, చేతులు ఖాళీగా లేవు కాబట్టి వశం తప్పి ఒక్కసారిగా నా మీద ఒరిగిపోయాడు. అతని చేతి పొట్లంలోంచి మిక్చర్ నా చొక్కాపై పడింది. మల్లెపువ్వులాంటి చొక్కా - అది మల్లె పువ్వులా కనబడడానికి దోబి వానికి ఐదు రూపాయలు ఇచ్చాను. ఇప్పు డా మిక్చర్ నూనె మరకలు అంటుకొన్నాయి.

నాకు కోపం తారస్థాయిని దాటింది. "ఏమిటండీ ఇది? మిక్చర్ అంతా మీద ఒలకబోశారు." గట్టిగా కసిరాను.

"బస్సు మలువు తిరిగింది. పొరపాటున మీ మీద పడింది మిక్చర్. అంత మాత్రానా అంతలా అరుస్తావెందుకు?" అంతే గట్టిగా అతనూ అరిచాడు.

"సర్దుకుపోండి సార్." వెనకాల ఎవరో సలహా ఇచ్చారు.

నాకు తిక్కరేగింది. కాని నా తిక్కను బయట పెట్టలేక స్థూలకాయుడ్ని అలర్జీ చూపుల్తో చూసి కిటికీ వైపు తలతిప్పి 'ఇట్ల తినేకదా ఈ సైజు పెరిగాడు' అని గొణిగాను. అతను పట్టించుకోనట్లు, విన్నట్లు ఉండి పోయాడు. జీవితానికి హఠాత్తుగా మలువులు ఎలా వస్తాయో ప్రయాణానికి అలాంటి హఠాత్తు మలుపులు ఉంటాయి. ఈ సారి అతను నామీద పడకూడదని బస్సులో ఉన్న నిలువు 'రాడ్'ని గట్టిగా పట్టుకొన్నాడు. కాని అతని శరీరం మాత్రం అతని మాట వినక నామీద పడనే పడింది. నేనిక ఉండబట్టలేక మోచేత్తో అతన్ని ఓ పోటు పొడిచాను.

అంతే! నావైపు అతను గుర్రున చూసి "ఎందుకయ్యా అట్లా పొడిచావు?" తీవ్రంగా అడిగాడు.

"లేక పోతే ఏమిటండీ!?మాటి మాటికీ మీద పడతారు మీ సీట్లో మీరు కూర్చోక. సీ! నా సీట్లో సగం కూడా మీరే ఆక్రమించేశారు." నేనూ అరచినట్లే మాట్లాడాను.

"ఏందయ్యా తెగ మాట్లాడుతున్నావ్! బస్సులో ప్రయాణమన్నాక ఆ మాత్రం రానుకో కుంటారా? అంత ఇబ్బంది అయ్యేటప్పుడు అయ్యగారు కార్లో పోవాల." ఎగతాళిగా వాగాడు.

మా ఇద్దరి మధ్య వాదం పెరిగేదే కానీ ఇతరుల జోక్యం వలన సద్దుమణిగింది. కానీ నా మనసు మాత్రం భగభగ మని మండసాగింది. నా మనసు కసితో ఊగిపోసాగింది. అవకాశం వస్తే వాడిని బట్టలూడదీసి ఉతికేయలనుంది. "నన్ను మానసికంగా, శారీరకంగా హింసించి నతాయిస్తున్న వీడిని నేను ఏదో ఒక విధంగా హింసించాలి. నా కసి తీర్చుకోవాలి. నా వగ చల్లార్చుకోవాలి." అనుకొని, తల వెనక్కు వాల్చి ఏ విధంగా వగ చల్లార్చుకోవాలో ఆలోచించసాగాను.

రాత్రి పది గంటల సమయం. బస్సు అనంతపురం బస్ స్టేషన్‌కు చేరింది. అందరూ భోజనాలు చేయడాన్కి దిగారు. వారితో పాటు నేనూ దిగాను. భోజనం చేస్తున్నప్పుడు కూడా వగ తీర్చుకొనే మార్గం కోసం అన్వేషిస్తున్న నాకు అవతలి టేబుల్ వద్ద భోంచేస్తూ కనబడ్డ ఆ భారీ కాయుడి పాదుకలు [చెప్పులు] పై దృష్టి మళ్లింది.

అంతే! మెదడులో ఓ మెరుపు మెరిసింది. ప్రతీకారం తీర్చుకొనే మార్గం కనబడే సరికి మనసు కొంచెం తేలికబడింది, ఆనందపడింది. ఇంకే ఆ 'ఐడియా'ను ఆలోచించక ఆచరణలో పెట్టడమే మిలిగింది. భోజనాలు పూర్తయ్యాయి. బస్సు బయల్దేరింది. అందరూ నిద్రలోకి జారుకున్నారు. కడుపు నిండిన నేను నిద్రలోకి జారుకొన్నాను. బస్సులో లైట్లన్నీ ఆర్పివేశారు. చీకటి. బస్సు కర్నూల్ దాటే సరికి టైమ్ మూడు గంటలు దాటింది. ఆ విషయం మెలకువ వచ్చిన నాకు టైమ్ చూస్తే తెలిసింది. బస్సులో అందరూ జోగుతున్నారు. స్థూలకాయుడు కాళ్ల జోళ్లు తీసేసి గురక పెడుతున్నాడు. 'ఐడియా'ను ఆచరణలో ఉంచాలని మెల్లగా కిందకు వంగాను. బస్సంతా చీకటి కాబట్టి ఏమీ కనబడలేదు. క్రింద చేత్తో తడమగా చెప్పు చేతికి తగిలింది.

అంతే! మెల్లగా ఆ చెప్పును తీసి విండో లోంచి బయటకు విసిరేశాను. ఒక్క సారిగా నా వగ చల్లారింది. అతన్ని చూసి వెర్రిగా ఆనంద పడ్డాను. కాని ఎక్కడో ఓ మూల నాకు భయంగానే ఉంది. అతడు ఆ విషయం కనుక్కోంటాడేమోనని. ఎప్పుడు కునుకు తీశానో తెలీదు.

తెల్లవారుజామున ఐదు గంటలకు బస్ హైదరాబాద్ సెంట్రల్ బస్ స్టేషన్ చేరింది. నేను హడావుడిగా లేచి నా బ్రీఫ్ కేస్ తీసుకొని అతనెక్కడ కనుక్కుంటాడో నన్న భయంతో కూడిన టెన్షన్‌తో వేగంగా బస్సు దిగాను.

లోపల అతగాడు తన శరీరానికి శ్రమపెట్టి, చిరాకుగా పోయిన తన ఇంకో చెప్పు కోసం వెతకసాగాడు.

అతని అవస్థ బస్సు క్రింద నుంచే చూసి నేను భలే సంబరపడ్డాను.

అక్కడి నుండి నిష్క్రమిస్తే ఇంకా ఎక్కువ సంబర పడవచ్చుననుకొని ముందుకు నడవసాగాను. ఈ సంఘటన నా స్నేహితులకు చెప్తే పడీపడీ నవ్వుతారనుకోసాగాను.

ఇంతలో నడుస్తున్న నా భుజంపై ఓ బలమైన చెయ్యి పడింది. ఎవరా? అని వెనక్కు తిరిగి చూసాను. అంతే! నా ముఖంలో రక్తం ఇంకిపోయింది.

అతను నవ్వుతూ "మీరు పొరబాటున మీ చెప్పు అనుకొని నా చెప్పొకటి వేసుకొని వెళుతున్నారు." మెత్తగా చెప్పాడు.

నా వీపు మీద బలంగా చరిచినట్లయింది. నేను తలవంచి నా కాళ్లవైపు చూసుకొన్నాను.

ఒక చెప్పునాది, ఇంకొకటి అతనిది!

'సారి' అని చెప్పి, అతని చెప్పు అతనికి ఇచ్చి, నా చెప్పు వెతుక్కోడానికి బస్సెక్కి వెతకసాగాను.

అలా వెతక్కపోతే అందరికి అనుమానం వస్తుంది. నా కొక్కడికే తెలిసి అందరికి తెలీని నిజం ఏమిటంటే నా చెప్పును నేనే పారవేసుకోవడం.

మెరుపు లాంటి నా 'ఐడియా'ను ఒంటి చెప్పుచ్చుకొని కొట్టాలనిపించింది.

●

## గ్రహాంతర వాసులు

ఎగిరే పళ్లాల కథలు మనం చాలాసార్లు విన్నాం. వేరే గ్రహాల్లో ప్రాణికోటి ఉందా, లేదా అన్నది చాలా కాలంగా మనల్ని వేధిస్తున్న సమస్య. అమెరికాలోని వీక్లీ వరల్డ్ న్యూస్ అనే పత్రిక మరొక వింత కథ రాసింది. అదేమిటంటే -

21 మంది గ్రహాంతరవాసులు అమెరికాలోని పెట్రిఫైడ్ ఫారెస్ట్ నేషనల్ పార్క్‌లో నివాస ముంటున్నారు. వాళ్లు అరిజోనాలోని లాయర్ ద్వారా తమకి అమెరికా పౌరసత్వం ఇప్పించమని కోరుతూ ప్రెసిడెంట్ బిల్ క్లింటన్‌కి దరఖాస్తు పెట్టుకున్నారు. వాళ్లు మంచి ప్రవర్తన కలవాళ్లని, ఇంగ్లీషు బాగా మాట్లాడగలరని, వారి గ్రహంలో మతపరమైన ఆంక్షలు, బాధలు తట్టుకోలేక భూ గ్రహానికి వలస వచ్చారని వారి లాయర్ చెప్పాడు. అంటే గ్రహాంతరం పోయినా మతం చిచ్చుపోదని వారికి తెలియదు కాబోలు. కొన్నాళ్లీ లోకంలో ఉంటే, ఇక్కడి గోలపడలేక మళ్లీ వెనక్కి పోయి తీరతారు!

సేకరణ : పమ్మి వీరభద్రరావు [హైదరాబాదు]